విద్యార్థులకు సమగ్ర విద్య అవసరం

జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ ★ పేద విద్యార్థులకు పారితోషికాలు అందజేత

ఆటోనగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలు, కళల్లోనూ రాణించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ అన్నారు. విద్య ఉపాధి కోసమే కాకుండా, విద్యార్థి సమగ్రాభివృద్ధికి, రాష్ట్ర ఉపాధికి దోహదపడాలని పేర్కొన్నారు. శ్రీ రామరాజ భూషణ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల భట్టరాజ పేద-మెరిట్ విద్యార్థుల పారితోషిక ప్రదాన కార్యక్రమం-31వ వార్షికోత్సవం ఆటోనగర్‌లోని ఎగ్జిబిషన్ సొసైటీ హాలులో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఓ విద్యార్థి, ఒక కుటుంబం అభివృద్ధి చెందాలంటే చదువు ఎంతో అవసరమని అన్నారు. నగర మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడుతూ తెలివి ఎవరి సొత్తు కాదని, ధనిక కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అయ్యారని, టీ విక్రయించిన నరేంద్ర మోదీ దేశ ప్రధాని అయ్యారని అన్నారు.



విద్యార్థినికి బంగారు పతకాన్ని, నగదు పారితోషికాన్ని అందిస్తున్న గద్దె అనూరాధ. చిత్రంలో మేయర్, బొడ్డు నాగేశ్వరరావు తదితరులు

ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలు అభివృద్ధి చెందాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. శ్రీ రామరాజ భూషణ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కూరపాటి కోటంరాజు మాట్లాడుతూ 31 ఏళ్ల కిందట భట్టరాజ సేవా సమితిగా ఏర్పడి భట్టరాజ కులంలోని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి, వారి ఉన్నతికి తోడ్పడుతోందన్నారు. 2008లో ఎడ్యుకేషనల్ ట్రస్టును ఏర్పాటు చేసి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని జూనియర్ ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుతున్న పేద, ప్రతిభగల విద్యార్థులకు పారితోషికాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆరో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు మొత్తం రూ.1.30 లక్షల పారితోషికాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గద్దె అనూరాధ, కోనేరు శ్రీధర్, బొడ్డు నాగేశ్వరరావు విద్యార్థులకు బంగారు పతకాలు, పారితోషికాలను అందజేశారు. భట్టరాజ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బుక్కరాజు ముక్కంటి రాజు స్మారక అవార్డును ఆంధ్రప్రదేశ్ భట్టరాజ సంఘం కో-ఆపరేటివ్ పెడరేషన్ సాధనకర్త తంగెళ్ల శేషంరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి సరికొండ సతీష్, మైదకూరు మున్సిపల్ ఛైర్మన్ సీహెచ్ రంగసింహ తదితరులు పాల్గొన్నారు.